క్లుప్తంగా

అగ్నిప్రమాదాలపై అవగాహన


బస్టాండ్ వద్ద అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

పొదలకూరు : అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా స్థానిక ఫైర్ఆఫీసర్ వరకుమార్ ఆధ్వర్యంలో బస్టాండ్ వద్ద అగ్నిప్రమాదాలపై ప్రజలకు సోమవారం అవగాహన కల్పించారు. గ్యాస్ సిలిండర్ల వాడకం, దాని వల్ల కలిగే ప్రమాదాలను వివరించారు. అనంతరం మాల్స్‌లో నెలకొనే ప్రమాదాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

నిరంతర నిఘాతో మద్యం, నగదు కట్టడి


వాహనాన్ని తనిఖీ చేస్తున్న నగర డీఎస్పీ శ్రీనివాసరెడ్డి

నెల్లూరు(క్రైమ్): నిరంతర నిఘాతో సార్వత్రిక ఎన్నికల్లో మద్యం, నగదును కట్టడి చేయాలని నగర డీఎస్పీ శ్రీనివాసరెడ్డి పోలీసులను ఆదేశించారు. నగరంలోని చిల్డ్రన్స్‌పార్కు, ఇరుకళలపరమేశ్వరి గుడి సమీపంలోని చెక్‌పోస్టులను సోమవారం రాత్రి ఆయన తనిఖీచేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ఎన్నికల నేపథ్యంలో నగరంలో నిఘా వ్యవస్థను పటిష్టం చేశామన్నారు. నగరంలోని ప్రధాన రహదారులు, కూడళ్ల వద్ద క్షుణ్ణంగా వాహనాల తనిఖీలు చేపడుతున్నామని చెప్పారు. ఎన్నికల కమిషన్ నిబంధనలకు విరుద్ధంగా సరైన ఆధారాలు లేకుండా తరలించే నగదును సీజ్‌చేసి ట్రెజరీ, ఆదాయ పన్నుశాఖ అధికారులకు అప్పగిస్తున్నామన్నారు. మద్యం అక్రమ రవాణా, అనధికార విక్రయాలపై దాడులు చేసి నిందితులపై కేసులు నమోదు చేస్తునామన్నారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న దృష్ట్యా ప్రజలు రూ.50వేలకు మించి నగదు తీసుకెళ్లరాదన్నారు. అత్యవసర పరిస్థితుల్లో తీసుకెళ్లాల్సి వస్తే సంబంధిత ఆధారాలు, ధ్రువీకరణపత్రాలు వెంట ఉంచుకోవాలన్నారు. ఈ నెల 18 నుంచి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కానుండడంతో నగరంలోని నామినేషన్ కేంద్రాల వద్ద పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ప్రతిఒక్కరూ ఎన్నికల కోడ్‌కు అనుగుణంగా నడుచుకోవాలని, ఎవరైనా ఉల్లంఘనలకు పాల్పడితే చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎన్నికల ఉల్లంఘనపై సీ విజిల్ యాప్, టోల్‌ఫ్రీ నంబర్ 112 లేదా స్థానిక పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రశాంత ఎన్నికలకు ప్రజలు సహకరించాలని కోరారు.

వాహనాల తనిఖీ



నెల్లూరు(బారకాసు): సార్వత్రిక ఎన్నికల విధుల్లో భాగంగా నగరంలోని చిల్డ్రన్స్‌పార్కు రోడ్డులో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును నెల్లూరు సిటీ అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ ఆఫీసర్ వికాస్‌మర్మత్ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా హైవే నుంచి నగరంలోకి వస్తున్న వాహనాలను తనిఖీ చేశారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున మద్యం, నగదు, మారణాయుధాలను రవాణా చేయడం చట్టరీత్యా నేరమని తెలిపారు. ఓటర్లను ప్రలోభ పెట్టేందుకు ఎవరైనా మద్యం, నగదు, కానుకలను పంపిణీ చేస్తుంటే తగిన ఆధారాలతో సీ విజిల్ మొబైల్ యాప్ ద్వారా ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ఈ తనిఖీల్లో ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం పాల్గొన్నారు.

కిర్రాక్ ఆర్పీపై కేసు నమోదు

నెల్లూరు(క్రైమ్): జబర్దస్త్ ఫేమ్ కిర్రాక్ ఆర్పీపై దర్గామిట్ట పోలీసులు సోమవారం కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. వివరాలు..గత కొంతకాలంగా కిర్రాక్ ఆర్పీ టీడీపీ నెల్లూరు ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అనుచరుడిగా కొనసాగుతున్నారు. ఆయనకు వ్యతిరేకంగా ఎవ్వరు మాట్లాడినా కౌంటర్ ఇవ్వసాగారు. ఈ నేపథ్యంలో ఇటీవల వైఎస్సార్‌సీపీ నేతలపై ఆయన తీవ్రస్థాయిలో అనుచిత వ్యాఖ్యలు చేశారు. ఆయన వ్యాఖ్యలు అభ్యంతరకరంగా ఉండటంతో కిర్రాక్ ఆర్పీపై చర్యలు తీసుకోవాలని ఆ పార్టీ నాయకులు రెండ్రోజుల కిందట దర్గామిట్ట పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు ఆయనను విచారిస్తున్నారు.

ప్రతి గ్రామానికి సాగునీరందిస్తా

- గ్రామాల్లో మట్టిరోడ్లు లేకుండా చేశా
- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి


కొనగలూరులో మంత్రి కాకాణికి స్వాగతం పలుకుతున్న మహిళలు

పొదలకూరు : ప్రతి గ్రామానికి సాగునీటిని అందించి తీరుతానని, అవకాశం లేకుంటే లిఫ్ట్ పద్ధతిన మర్రిపల్లి చెరువునకు సాగునీటిని సరఫరా చేస్తామని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. మండలంలోని మర్రిపల్లి, కొనగలూరు, రామాపురం, దుగ్గుంట, దుగ్గుంటరాజుపాళెం, ఊట్లపాళెం, కొత్తకంభాలపల్లి తదితర గ్రామాల్లో మంత్రి సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇప్పటికే దుగ్గుంట పంచాయతీలో గ్రామాలకు ఒకటో బ్రాంచి కాలువ ద్వారా సాగునీరు అందుతున్నట్లు తెలిపారు. మర్రిపల్లికి కండలేరు ఎడమ కాలువ ద్వారా సాగునీటిని అందిస్తామన్నారు. ప్రతి గ్రామంలో మట్టిరోడ్లు లేకుండా సిమెంటు రోడ్లు, సైడ్‌డ్రైయిన్లను నిర్మించినట్లు చెప్పారు. మీలో ఒకడిగా, మీ ఇంటి బిడ్డగా అభివృద్ధి పనులు చేపట్టినట్లు వెల్లడించారు. ఏ గ్రామానికి ఎలాంటి పనులు అవసరమో తనకంటే బాగా తెలిసిన నాయకుడు లేరన్నారు. మంత్రి రాక సందర్భంగా ప్రతి గ్రామంలో పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు స్వాగతం పలుకగా, మహిళలు హారతులు పట్టారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు పెదమల్లు రమణారెడ్డి, పార్టీ నేతలు ఆర్.అంకోజీ, ఎం.గోపాల్‌రెడ్డి, వి.సుధాకర్, ఎం.వెంకటేశ్వర్లు, ఎం.రామకృష్ణ, వి.రామచంద్రయ్య, శ్రీనివాసులుగౌడ్, కేతు రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్ల సామూహిక రాజీనామా


పొదలకూరు : ఎంపీడీఓకు రాజీనామాలు అందజేస్తున్న మహ్మదాపురం వలంటీర్లు

పొదలకూరు : మండలంలోని పలు సచివాలయాలకు చెందిన వలంటీర్లు సోమవారం సామూహిక రాజీనామాలు చేశారు. ఈ సందర్భంగా రాజీనామా లేఖలను ఎంపీడీఓ ఎస్‌ఏ మహ్మద్‌రఫీకు అందజేశారు. మొగళ్లూరు, ఆర్‌వై పాళెం, అంకుపల్లి, పులికల్లు, మహ్మదాపురం, వావింటపర్తి, ఊసపల్లి తదితర గ్రామాలకు చెందిన వలంటీర్లు రాజీనామాలు చేసిన వారిలో ఉన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ తమను ప్రతిపక్ష పార్టీల నేతలు అడుగడుగునా అవమానిస్తున్నట్లు తెలిపారు. స్వచ్ఛందంగా ప్రజలకు సేవ చేస్తున్న తమకు రాజకీయ రంగు పులిమి ఇబ్బందులకు గురిచేసినట్లు వాపోయారు. తాము సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి తోడుగా ఉంటామని వెల్లడించారు.

ముదివర్తిపాళెంలో..

ఇందుకూరుపేట : మండలంలోని ముదివర్తిపాళెం గ్రామ వలంటీర్లు సోమవారం రాజీనామా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను పేదలకు అందజేసే భాగ్యం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తమకు కల్పించారని, ప్రస్తుతం ఆ అవకాశం లేనప్పుడు వలంటీర్లుగా కొనసాగడం ఇష్టం లేదన్నారు. అందుకే రాజీనామా చేస్తున్నట్లు వెల్లడించారు.

పంటపాళెంలో..

ముత్తుకూరు : మండలంలోని పంటపాళెం సచివాలయ పరిధిలో వలంటీర్లుగా పనిచేస్తున్న 20 మంది సోమవారం సామూహిక రాజీనామాలు చేశారు. ఈ మేరకు తమ రాజీనామా లేఖలను ఇన్‌చార్జి ఎంపీడీఓ శ్రీనివాసరావుకు అందజేశారు.


పొదలకూరు : మాట్లాడుతున్న వలంటీర్లు


ఇందుకూరుపేట : రాజీనామా చేసిన వలంటీర్లు

18న ఎమ్మెల్యే ప్రసన్న నామినేషన్

కోవూరు : వైఎస్సార్‌సీపీ కోవూరు నియోజకవర్గ అభ్యర్థిగా ఈనెల 18వ తేదీన ఉదయం 11.04 నిమిషాలకు నామినేషన్ దాఖలు చేస్తానని ప్రసన్నకుమార్‌రెడ్డి సోమవారం తెలిపారు. ప్రజలు తనను ఆశీర్వదించాలని కోరారు. నామినేషన్ సమయంలో ఎటువంటి ఆడంబరాలకు పోకుండా ఎన్నికల కమిషన్ సూచనల మేరకు నామినేషన్ దాఖలు చేస్తానన్నారు.

మంత్రి కాకాణి ఎన్నికల ప్రచారం నేడు

మనుబోలు : మండలంలోని వీరంపల్లి, వడ్లపూడి, గొట్లపాళెం తదితర గ్రామాల్లో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి మంగళవారం ఎన్నికల ప్రచారం చేస్తారని వైఎస్సార్‌సీపీ నాయకుడు, వీరంపల్లి మాజీ సర్పంచ్ జట్టి సురేంధర్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 4 గంటలకు ప్రారంభం కానున్న ప్రచార కార్యక్రమానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీగా హాజరై విజయవంతం చేయాలని కోరారు.

నేడు కమ్మపాళెంలో వైఎస్సార్‌సీపీ సభ

కొడవలూరు : వైఎస్సార్‌సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు విజయసాయిరెడ్డి, ప్రసన్నకుమార్‌రెడ్డి ఎన్నికల ప్రచారంలో భాగంగా మండలంలోని కమ్మపాళెంలో మంగళవారం బైక్ ర్యాలీ, బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు డీసీఎమ్మెస్ చైర్మన్ వీరి చలపతిరావు సోమవారం తెలిపారు. సాయంత్రం 4.30 గంటలకు సంజీవనగర్ వద్ద బైక్ ర్యాలీ ఆరంభమై చంద్రశేఖరపురం మీదుగా కమ్మపాళెం చేరుకుని బహిరంగ సభ నిర్వహిస్తామన్నారు. అనంతరం గుర్రాలదిన్నెలో ఎన్నికల ప్రచారం ఉంటుందన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక సంస్థల ప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

శాస్త్రోక్తంగా మహా కుంభాభిషేకం


కల్యాణోత్సవం జరిపిస్తున్న అర్చకులు

ఇందుకూరుపేట : కొమరిక గ్రామంలో కొలువైన శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశవస్వామి ఆలయంలో మహాకుంభాభిషేకం సోమవారం శాస్త్రోక్తంగా జరిగింది. తొలుత జీర్ణోద్ధరణ, నిత్య హోమం, మహా పూర్ణాహుతి, ఆలయ శిఖర ప్రతిష్ఠ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవం వేదపండితుల మంత్రోచ్చారణలు, మంగళ వాయిద్యాల నడుమ కనుల పండువగా సాగింది. ఈ వేడుకను చూసి భక్తులు పరవశించారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆలయ అర్చకుడు తులసీరాం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ముంగర బాలకృష్ణారెడ్డి, నిత్యనాగిని దంపతులు ఉభయదాతలుగా వ్యవహరించారు. దీంతో గ్రామంలో కోలాహలం నెలకొంది.

సీఎంపై హత్యాయత్నం హేయమైన చర్య


మాట్లాడుతున్న విజయ్‌కుమార్

ఇందుకూరుపేట : సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై హత్యాయత్నం హేయమైన చర్య అని ఏపీఎల్‌డీఏ చైర్మన్ గొల్లపల్లి విజయ్‌కుమార్ అన్నారు. మండలంలోని పున్నూరులో ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడారు. హింస, దాడులు ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు అని తెలిపారు. ఇలాంటి దుశ్చర్యలతో జగన్‌మోహన్‌రెడ్డి విజయాన్ని ఆపలేరన్నారు. ప్రజాస్వామ్యంలో న్యాయనిర్ణేతలు ప్రజలేనని, వారే తగిన విధంగా బుద్ధి చెబుతారన్నారు. నేటి ఆధునిక కాలంలో రాతియుగం వలే ఇలాంటి చర్యలకు పాల్పడడం క్షమించరాని నేరమన్నారు. ప్రజలు మేలు చేసిన వారినే ఆదరిస్తారని, దాడులు చేసిన వారిని ఎన్నటికీ క్షమించరన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు బీవీ రమణయ్య, వైఎస్సార్‌సీపీ నేతలు కరుణాకర్, అవినాష్, కృష్ణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నామినేషన్ల ప్రక్రియకు సర్వం సిద్ధం

కోవూరు : ఈనెల 18 నుంచి నామినేషన్ల పర్వం కొనసాగుతుందని, దీనికి సంబంధించి అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశామని కోవూరు ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్ అన్నారు. కోవూరు మండల కేంద్రంలోని ఆర్వో కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడారు. ఇప్పటికే నామినేషన్లకు సంబంధించి ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టినట్లు తెలిపారు. ఈనెల 18 నుంచి 25వ తేదీ వరకు నామినేషన్లు తీసుకుంటామని, ఉదయం 11 నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు కొనసాగుతుందన్నారు. దీనికోసం ప్రత్యేక కౌంటర్‌ను కూడా ఆర్వో కార్యాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. ప్రత్యేక ప్రాంగణంలో నోటీసు బోర్డులు ఏర్పాటు చేశామని, ప్రతిరోజూ నామినేషన్లకు సంబంధించి ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో పొందు పరిచేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. నామినేషన్ వేసేందుకు అభ్యర్థితో పాటు మరో నలుగురికి మాత్రమే ఆర్వో కార్యాలయానికి అనుమతి ఉందన్నారు. అభ్యర్థులు రూ.10 వేలు డిపాజిట్ చేయాలన్నారు. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు నామినేషన్ ఫీజు రూ.5 వేలుగా ఉందన్నారు. 25వ తేదీ సాయంత్రం మూడు గంటల్లోగా వచ్చిన నామినేషన్లు మాత్రమే పరిగణనలోకి తీసుకుంటామన్నారు. 26న స్క్రూటినీ ఉంటుందని, 29న సాయంత్రం మూడు గంటల వరకు నామినేషన్లను విత్‌డ్రా చేసుకోవచ్చని తెలియజేశారు. అనంతరం బరిలో నిలిచిన అభ్యర్థుల జాబితాను నోటీసు బోర్డులో ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం ఆయన కోవూరు సీఐ టీవీ శ్రీనివాసరావు, ఎస్సై రంగనాథ్‌గౌడ్‌తో పలు విషయాలపై చర్చించారు.

'సంక్షేమ పథకాలే గెలిపిస్తాయి'


స్థానిక మహిళలతో ఎమ్మెల్యే ప్రసన్న, ఎమ్మెల్సీ కల్యాణ్ చక్రవర్తి

- ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి

కోవూరు : కుల, మత, పార్టీలకు అతీతంగా అందించిన సంక్షేమ పథకాలే వైఎస్సార్‌సీపీని గెలిపిస్తాయి అని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి అన్నారు. కోవూరు మండలం పడుగుపాడులో సోమవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గడిచిన ఐదేళ్లలో ప్రతి కుటుంబానికి సంక్షేమ ఫలాలు అందాయని తెలిపారు. పడుగుపాడులోనే రూ.41.49 కోట్ల సంక్షేమ పథకాలు అందాయని వివరించారు. ఆర్‌ఓ ప్లాంట్ల ద్వారా తాగునీటిని అందిస్తున్నామని, జల్‌జీవన్ మిషన్ ద్వారా ఇంటింటికీ కుళాయి కనెక్షన్లు ఇస్తున్నట్లు తెలియజేశారు. పాత పడుగుపాడులోని పాఠశాలలకు నాడు-నేడు కింద రూ.23.49 లక్షలతో అభివృద్ధి చేసినట్లు తెలియజేశారు. భారతదేశ చరిత్రలోనే ఆదర్శ రాష్ట్రంగా మన ఆంధ్రప్రదేశ్‌ను తీర్చిదిద్దారని, ప్రజలు ఒకసారి ఆలోచించి ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రతిపక్షాలు చేసేది లేక దాడులు చేయిస్తున్నాయని, దీనికి ఉదాహరణే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై జరిగిన హత్యాయత్నం అని తెలిపారు. ఎన్ని కుట్రలు, కుతంత్రాలు చేసినా వైఎస్ జగన్‌ను సీఎం చేసుకునేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. వేమిరెడ్డికి వైఎస్సార్‌సీపీలో సముచిత స్థానం కల్పించినా వెన్నుపోటు పొడిచారని, ప్రజలే వారికి తగిన బుద్ధి చెబుతారన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సోమిరెడ్డి ఓటమి ఖాయం

- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి


వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో మంత్రి కాకాణి

తోటపల్లిగూడూరు : సర్వేపల్లి నియోజకవర్గంలో సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డికి ముచ్చటగా మూడోసారి ఓటమి ఖాయమని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని ఇస్కపాళెం పంచాయతీకి చెందిన 80 టీడీపీ కుటుంబాలు సోమవారం వైఎస్సార్‌సీపీలో చేరాయి. నెల్లూరులోని మంత్రి నివాసంలో వీరికి కాకాణి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కాకాణి మాట్లాడుతూ సోమిరెడ్డి గతంలో వ్యవసాయ శాఖ మంత్రిగా రైతులను దోచుకోవడమే తప్ప వారికి మంచి చేసిందేమీ లేదన్నారు. ఇప్పుడు మళ్లీ సర్వేపల్లి నియోజకవర్గంలో ఎమ్మెల్యే అభ్యర్థిగా గెలుపు గురించి పక్కన పెట్టి వసూళ్లపై దృష్టి సారించారన్నారు. సర్వేపల్లి ప్రజలు మరోసారి సోమిరెడ్డిని ఓడించేందుకు సిద్ధంగా ఉన్నారని, రాజకీయ సన్యాసం తీసుకునేందుకు సోమిరెడ్డి కూడా సిద్ధంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు ఉప్పల శంకరయ్యగౌడ్, జెడ్పీటీసీ సభ్యురాలు ఎంబేటి శేషమ్మ, వరిగొండ పార్టీ నేత గూడూరు విష్ణుమోహన్‌రెడ్డి, స్థానిక నాయకులు రాయపు శీనయ్య, కాయల మణి, ఎంబేటి సంధ్యారాణి, పల్లం లత తదితరులు పాల్గొన్నారు.

సమర్థవంతంగా విధులు నిర్వహించాలి


శిక్షణ కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

కోవూరు : పోలింగ్ విధులకు హాజరయ్యే పీఓలు, ఏపీఓలు సమర్థవంతంగా తమ బాధ్యతలు నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హరినారాయణన్ తెలిపారు. కోవూరు మండలం గంగవరం గ్రామంలోని గీతాంజలి ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహిస్తున్న పోలింగ్ శిక్షణ శిబిరాన్ని సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిక్షణలో నేర్చుకున్న అంశాలపై పూర్తిస్థాయిలో అవగాహన చేసుకోవాలన్నారు. పోలింగ్‌కు సంబంధించి ఏమైనా సమస్యలు, సందేహాలు ఉంటే వెంటనే వాటిని నివృత్తి చేసుకోవాలన్నారు. ముఖ్యంగా ఈవీఎం యంత్రాల వినియోగంపై పోలింగ్ సిబ్బంది ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పోలింగ్ రోజున అధికారులు మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎటువంటి పొరపాట్లు లేకుండా పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా నిర్వహించేందుకు అధికారులకు శిక్షణా కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు. అనంతరం ఆయన పోలింగ్ అధికారులను పలు ప్రశ్నలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట కోవూరు ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్, ఏఈఆర్వో విజయశ్రీ, తదితరులు ఉన్నారు.

వైఎస్సార్‌సీపీతోనే అన్నివర్గాలకు మేలు


బుచ్చిరెడ్డిపాళెం రూరల్: ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న రజత్‌కుమార్‌రెడ్డి, రాహిన్‌రెడ్డి

కొడవలూరు : వైఎస్సార్‌సీపీతోనే అన్నివర్గాల ప్రజలకు మేలు జరుగుతోందని, కోవూరు ఎమ్మెల్యేగా నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డిని ఆశీర్వదించాలని డీసీఎమ్మెస్ చైర్మన్ వీరి చలపతిరావు తెలిపారు. మండలంలోని గండవరంలో ఎమ్మెల్యే ప్రసన్న సతీమణి గీతారెడ్డి, కోడలు పూజితారెడ్డితో సోమవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎక్కడెక్కడో వ్యాపారాలు చేసుకొంటూ ఎన్నికల సమయంలో తమను గెలిపించాలంటూ టీడీపీ అభ్యర్థులు వస్తున్నారని, ఎన్నికల తరువాత వీరు ఎక్కడుంటారో ఎవరికీ తెలియదని చెప్పారు. నిరంతరం నియోజకవర్గంలో అందుబాటులో ఉండే వ్యక్తి ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి అని తెలిపారు. టీడీపీ ప్రభుత్వంలో నేతలు దోచుకుతింటే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పేదలు, మహిళలకు పంచి పెట్టిందన్నారు. ఈ విషయాన్ని ప్రజలంతా గ్రహించి మేలు చేసే వారికి ఓటు వేయాలని కోరారు. పూజితారెడ్డి మాట్లాడుతూ ప్రచారంలో ప్రజల స్పందన చూస్తుంటే ఎంతో ఆనందంగా ఉందన్నారు. జగనన్నను గెలిపించుకోవాల్సిన అవసరం మనందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గంధం వెంకటశేషయ్య, సచివాలయాల కన్వీనర్ కొండా శ్రీనివాసులురెడ్డి, సీనియర్ నేత అడపాల మోహనకృష్ణ, ఎంపీటీసీ పెనాక శ్రీనివాసులురెడ్డి, సర్పంచ్‌లు ఎన్.సునీల్‌కుమార్, ఎం.రంగారెడ్డి, ఎస్.శ్రీనివాసులు, సొసైటీ చైర్మన్ డి.శివకుమార్, నాయకులు రామిరెడ్డి రాజేష్‌రెడ్డి, కె.సుమన్, ఎస్.మాణిక్యరావు, పి.రవి పాల్గొన్నారు.

కొత్తవంగల్లులో..

మండలంలోని కొత్తవంగల్లులో వైఎస్సార్‌సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు వేణుంబాక విజయసాయిరెడ్డి, నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డిలను గెలిపించాలని కోరుతూ స్థానిక నాయకుడు చక్కా మనోహర్‌బాబు ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో పేదరికం అంతరించాలంటే జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ఎన్.ప్రసాద్, సర్పంచ్ ఎ.సింధు, ఉపసర్పంచ్ చక్కా రామయ్య, నాయకులు వేముల వెంకటేశ్వర్లు, శూలం హరిబాబు, కొనిజేటి శేషగిరిరావు, తిరుపతమ్మ, నారాయణ పాల్గొన్నారు.

కాగులపాడులో..

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: మండలంలోని కాగులపాడు గ్రామంలో కోవూరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ యువజన విభాగం అధ్యక్షుడు నల్లపరెడ్డి రజత్‌కుమార్‌రెడ్డి సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి కోవూరు వైఎస్సార్‌సీపీ అభ్యర్థి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి, ఎంపీ అభ్యర్థి విజయసాయిరెడ్డిని గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ప్రభుత్వం చేసిన అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలను వారికి వివరించారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డిపై రెండురోజుల క్రితం దాడి చేసిన విషయంపై మాట్లాడుతూ ప్రజాదరణను ఓర్చుకోలేక దాడులు చేస్తున్నారన్నారు. వీటిని ఉపేక్షించేది లేదన్నారు. త్వరలో ప్రజలే తగిన బుద్ధి చెబుతారని వివరించారు. కార్యక్రమంలో నల్లపరెడ్డి రాహిన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చెర్లో సతీష్‌రెడ్డి, గ్రామ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.


కొడవలూరు : గండవరంలో ప్రసన్న కుటుంబ సభ్యులతో ప్రచారం చేస్తున్న చలపతిరావు


కొడవలూరు : కొత్తవంగల్లులో..